## వచ్చిపోయే కరెంట్‌తో మోటర్లు కాలిపోతున్నాయి..

అక్కన్నపేట, మార్చి12: బావులు, బోర్ల లో భూగర్భ జలాలు అడగంటిపోవ డం, వచ్చిపోయే కరెంటుతో మోటర్లు తరుచూ కాలిపోతున్నాయి. రోజుకు రెం డు మూడు మోటర్లు రిపేర్ చేస్తున్నాను. మోటర్ కాలిపోయిందంటే రైతుకు చా లా నష్టం. సుమారు రూ.నాలుగైదు వే లు ఖర్చు అవుతున్నది. ఈ సీజన్‌లో ఒక్కో రైతు మోటర్ రెండు, మూడు సా ర్లు కాలిపోయాయి. రైతులు చానా ఇబ్బంది పడుతున్నరు.

–బండి సంజీవ్, మెకానిక్, గొల్లపల్లి (సిద్దిపేట జిల్లా)


సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం కట్కూరులో రాత్రిపూట ట్రాక్టర్‌పై ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసుకెళ్తున్న రైతులు


నమస్తే తెలంగాణ

సిద్దిపేట

I హైదరాబాద్, గురువారం 13 మార్చి 2025 | SIDDIPET



ఎమ్మెల్సీ కవితతో ఆలయ పనులపై మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

## ఆలయ పెండింగ్ పనులు పూర్తిచేయించాలి

### ఎమ్మెల్సీ కవితకు వినతి

మర్కూక్, మార్చి 12: సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలంలోని వరదరాజులస్వామి ఆలయ పెండింగ్ పనులు పూర్తి చేయించాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు విజ్ఞప్తి చేశారు. బుధవారం బీఆర్ఎస్ మర్కూక్ మండల నాయకులు అప్పాల ప్రవీణ్, లక్కాకుల నరేశ్, తుమ్మ ధనలక్ష్మీకృష్ణ, ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ, కమిటీ సభ్యులు కవితను కలిసి విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్‌లో ఆలయ పునరుద్ధరణకు రూ.10 కోట్ల ఎస్డీఎఫ్ నిధులు మంజూరు చేయగా, వాటిలో దాదాపు 65శాతం పనులు పూర్తి అయ్యాయని, అధికారులు, కాంట్రాక్టర్‌తో మాట్లాడి మిగతా పనులు బ్రహ్మోత్సవాల నాటికి పూర్తయ్యేలా కృషి చేయాలని బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్సీని కోరారు.

# కర్షకులకు కరెంట్ కష్టాలు..!

## ఉమ్మడి మెదక్ జిల్లాలో అప్రకటిత విద్యుత్ కోతలు

కాంగ్రెస్ పాలనలో రైతులకు కరెంట్ కష్టాలు మొదలయ్యాయి. రైతులకు కునుకు కరువైంది. కరెంట్ కోసం రాత్రంతా పొలాల దగ్గర పడిగాపులు కాయాల్సి వస్తున్నది. మడిమడికి పైపుల ద్వారా నీళ్లు తడపాల్సి వస్తున్నది. వచ్చి పోయే కరెంట్‌తో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కరెంట్ మోటర్లు తరుచూ కాలుతున్నాయి.లో వోల్టేజీ సమస్యతో సతమతమవుతున్నారు. ఒక్కో రైతు వ్యవసాయ బావి మోటరు ఇప్పటికే రెండు మూడుసార్లు కాలిపోయాయి. మోటరు దించడానికి, పైకి తీయడానికి, రిపేరు ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. ఇంతచేసినా రైతుకు పెట్టుబడి మేర డబ్బులు వస్తాయన్న గ్యారెంటీ లేకుండా పోయింది. బీఆర్ఎస్ హయాంలో 24 గంటల కరెంట్‌తో రైతులు హ్యాపీగా వ్యవసాయం చేశారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా పోయింది.


సంగారెడ్డి పట్టణంలో కాలిపోయిన మోటర్లను రిపేర్ చేస్తున్న మెకానిక్‌లు

సిద్దిపేట, మార్చి 12( నమస్తే తెలంగాణ ప్రతినిధి): సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో కరెంట్ కష్టాలు రైతులను వేధిస్తున్నాయి. వచ్చి పోయే కరెంట్‌తో వ్యవసాయ బావుల వద్ద మోటర్లు, బోర్ మోటర్లు మాటిమాటికి కాలిపోతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లు కాలుతున్నాయి. రైతులే కాలిన ట్రాన్స్‌ఫార్మర్లను విద్యుత్ ఉప కేంద్రాలకు తీసుకుపోయి బాగు చేయిస్తున్నారు. రాత్రినక పగలనక కరెంట్ కోసం రైతులు ఇబ్బంది పడుతున్నారు. సమైక్య రాష్ట్రంలో నాటి పరిస్థితులు ఉన్నాయి. కాంగ్రెస్ 15 నెలల పాలనలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకవైపు కరెంట్ కష్టాలు, మరోవైపు అడుగంటిన భూగర్భజలాలతో పంటలకు నీళ్లు అందించలేక రైతులు దిగులు చెందుతున్నారు. యాసంగిలో వేసిన వరి పంట ప్రస్తుతం పొట్టదశలో ఉన్నది. ఈ సమయంలో పంటకు తగినంత నీళ్లు అవసరం.తరచూ మోటర్లు కాలుతుండడంతో నీళ్లందక పంటలు ఎండిపోతున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో అన్నిరకాల విద్యుత్ కనెక్షన్లు 17,51,603 ఉన్నాయి. ప్రస్తుతం రోజుకు 34.2 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరుగుతున్నది. సిద్దిపేట జిల్లాలో అన్ని రకాల విద్యుత్ కనెక్షన్లు 5,75,928 ఉన్నాయి. వీటిలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు 1,73,530, గృహ 3,53,346, పరిశ్రమలు 3,850, మిగతా 45,202 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రస్తుతం సిద్దిపేట జిల్లాలో రోజుకు 11.2 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం అవుతున్నది. మెదక్ జిల్లాలో అన్ని రకాల విద్యుత్ కనెక్షన్లు 3,55,093 ఉన్నాయి. వీటిలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు 1,09,152, గృహ విద్యుత్ కనెక్షన్లు 2,09,174, పరిశ్రమలు 2,411, మిగతా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. మెదక్ జిల్లాలో నిత్యం 8 యూనిట్ల విద్యుత్ వినియోగం అవుతున్నది. సంగారెడ్డి జిల్లాలో గృహ విద్యుత్ కనెక్షన్లు 6,14,652, వాణిజ్య 76,938, పరిశ్రమలు 5,504, వ్యవసాయం 1,06,061, ఇతర 17,427 కనెక్షన్లు ఉన్నాయి. జిలాల్లో అన్ని రకాల విద్యుత్ కనెక్షన్లు 8,20,582 ఉన్నాయి. సంగారెడ్డిలో జిల్లాలో రోజూ 15 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరుగుతున్నది.

### కాలుతున్న మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు

ఉమ్మడి మెదక్ జిల్లాలో లోవోల్టేజీ సమస్యతో నిత్యం వందల కొద్ది వ్యవసాయ మోటర్లు కాలుతున్నాయి. కరెంట్ ఎప్పుడు వస్తుందో...ఎప్పుడు పోతుందో తెలియక రైతులు పొలాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తున్నది. అనధికార కరెంట్ కోతలు విధిస్తున్నారు, రాత్రివేళ ఇష్టం వచ్చినట్లు కరెంట్ ఇస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. వ్యవసాయ బావుల వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ పోతే లైన్ ఇన్‌స్పెక్టర్, విద్యుత్ సిబ్బంది సకాలం లో స్పందించడం లేదని, తామే సరిచేసుకుంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోరుబావుల మోటర్లు కాలిపోతుండడంతో రిపేరు షాపులకు గిరాకీ ఏర్పడింది. రైతులు రిపేర్ షాప్‌ల వద్ద క్యూకడుతున్నారు.

- రాత్రులంతా పొలాల వద్దనే రైతుల పడిగాపులు
- కాంగ్రెస్ పాలనలో రైతులకు నిద్ర కరువు
- కేసీఆర్ పాలనలో 24గంటల కరెంట్‌తో కంటినిండా నిద్ర
- ప్రస్తుత యాసంగిలో విపరీతంగా కాలుతున్న మోటర్లు
- మెకానిక్ షాపులకు గిరాకీ
- ట్రాన్స్‌ఫార్మర్ మీద ఫ్యూజ్ పోతే సరిచేసే వారు కరువు
- తీవ్ర ఇబ్బందుల్లో అన్నదాతలు


సిద్దిపేటలో ట్రాన్స్‌ఫార్మర్లను రిపేర్ చేస్తున్న విద్యుత్ సిబ్బంది


సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి గ్రామంలో పొలం వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను రిపేర్ చేస్తున్న సిబ్బంది


సిద్దిపేటలో కాలిపోయిన మోటర్లను రిపేర్ చేస్తున్న మెకానిక్‌లు


సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం గురువన్నపేట గ్రామంలో బోరు ఎండిపోవడంతో మోటర్‌ను బయటకు తీస్తున్న రైతులు

### కరెంట్ మంచిగ రాక పొలం ఎండింది..

మిరుదొడ్డి, మార్చి 12: రాత్రి 12 గంటల కరెంట్ ఇయ్యడంతో శాన కష్టం అవుతాంది. రాత్రి 10 గంటల నుంచి కరెంట్ ఇచ్చి పగటి పూట కట్ చేసుకుంటే మంచిగుంటది. కేసీఆర్ సార్ ఉన్నప్పుడు కరెంట్, సాగు నీళ్లకు ఎలాంటి రంది లేకుండే. రెండున్నర ఎకరాల్లో వరి పంట ఏసిన. వరి పొట్ట దశకు వచ్చే క్రమంలోనే బోరులో నీళ్లు తగ్గిపోయి పంట ఎండిపోయింది. రూ.60 వేలు వరకు పెట్టుబడి అయ్యింది. కరెంట్ సక్కగ రాక, నీళ్లు లేక పొలం మొత్తం ఎండింది.

–అయ్యోరి బాలయ్య, రైతు, మిరుదొడ్డి (సిద్దిపేట జిల్లా)



### సర్కార్‌కు రైతుల ఉసురు తగులుతుంది..

కంది, మార్చి 12: లోవోల్టేజ్‌తో బోరు మోటర్ కాలిపోయి పంట పూర్తిగా ఎండిపోయింది. మోటర్‌ను రిపేర్ చేసి బిగించే వరకు నాలుగు రోజులు పట్టింది. దీంతో ఉన్న ఎకరం పంట ఎండి పోయింది. నాతో పాటు చుట్టుపక్కల ఉన్న ఐదుగురి బోరు మోటర్లు కాలిపోయాయి. పంటకు పెట్టిన పెట్టుబడి పాయే. మోటర్ రిపేర్ కోసం రూ.20వేల ఖర్చు వచ్చింది. కేసీఆర్ ఉన్నప్పుడు ఎప్పుడు కూడా కరెంట్ సమస్య రాలేదు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి అన్ని కష్టాలే వచ్చినయి. పంట పెట్టుబడి సాయం ఇప్పటి వరకు రాలేదు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రైతుల శాపం తప్పక తగులుతుంది.

– ఒడ్డెపల్లి అంజయ్యగౌడ్, రైతు, చిమ్నాపూర్ (సంగారెడ్డి జిల్లా)


చిమ్నాపూర్‌లో బోరు మోటర్ కాలిపోవడంతో మరమ్మతులు చేయిస్తున్న రైతు అంజయ్య గౌడ్

## ఇస్నాపూర్ వెంచర్‌లో బౌన్సర్ల హల్‌చల్


ఇస్నాపూర్‌లో వెంచర్‌లో ఉద్రిక్తత దృశ్యం

పటాన్‌చెరు, మార్చి 12: సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్‌లో జీఎమ్మార్ వెంచర్‌లోని ఖాళీ స్థలంలో బీడీఎల్, ఓడీఎఫ్ హౌసింగ్ సొసైటీ సభ్యులు కడీలను పాతి అక్కడే టెంట్లు వేసి కూర్చున్నారు. ఈ విషయం తెలుసుకున్న వెంచర్ యజమాని మనుషులు, బౌన్సర్లతో వచ్చి ఆగ్రహంతో రాళ్లను కూల్చివేశారు. దీంతో బీడీఎల్, ఓడీఎఫ్ హౌసింగ్ కమిటీ సభ్యులు, వారి తాలూకా మనుషులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ ఘటనతో రెండు వర్గాల మధ్య తీవ్రస్థాయిలో మాటల యుద్ధం చోటుచేసుకుంది. ఒకరినొకరు తోసుకున్నారు. విషయం తెలిసిన పటాన్‌చెరు సీఐ వినాయక్‌రెడ్డి పోలీసు బృందాలను అక్కడికి పంపించారు. పోలీసులు రాగానే రెండు వర్గాల్లోని బౌన్సర్లను, సభ్యులను లాఠీలతో తరిమారు. మహిళలను, ఇతర సభ్యులను అక్కడి నుంచి పంపించి వేసి అక్కడ గొడవ జరగకుండా పహారా కాస్తున్నారు. ప్లాట్లను కబ్జాలోకి తీసుకునేందుకు ఒక వర్గం ప్రయత్నించగా, మరో వర్గం దానిని అడ్డుకున్నదని పోలీసులు తెలిపారు. తాము శాంతిభద్రతలను కాపాడేందుకు వచ్చామని పోలీసులు పేర్కొన్నారు. సర్వే నెంబర్ 162, 175, 191,206లో వేసిన వెంచర్‌లో తాము 2017లో 430 ప్లాట్లు సొసైటీ పేరున కొన్నామని సొసైటీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి విలేకరులకు తెలిపారు. ఆ తర్వాత ప్లాట్లు అమ్మిన వ్యక్తులకు రూ.38కోట్లు ఒప్పందం ప్రకారం ఇచ్చామని, అప్పటి నుంచి ప్లాట్లు రిజిస్ట్రేషన్లు చేసేందుకు ఇబ్బంది పెడుతున్నారని ఆయన తెలిపారు. సొసైటీ పేరున ఒత్తిడి తెస్తే వివిధ సమయాల్లో 390 ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేశారన్నారు. ఇంకా 40 పాట్లు సభ్యులకు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందన్నారు. వాటికోసం రెండుసార్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసినట్లు ఆయన చెప్పారు. రెండుసార్లు ఎఫ్ఐఆర్‌లు అయ్యాయని తెలిపారు. 40 ప్లాట్లుగా చూపిన స్థలంలో తాము కడీలు పాతుకున్నామని, తమ ప్లాట్లలో తాముంటే బౌన్సర్లు, రౌడీలను తెచ్చి వెంచర్ నిర్వాహకులు తమపై దాడికి దిగారని సొసైటీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి ఆరోపించారు.


మెదక్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

## పస్తులుండి పని ఎట్లా చేయాలి?

- ప్రభుత్వాన్ని నిలదీసిన పంచాయతీ కార్మికులు
- పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని మెదక్ కలెక్టరేట్ ఎదుట ధర్నా

మెదక్, మార్చి 12 (నమస్తే తెలంగాణ): పస్తులుండి పని ఎట్లా చేయాలని పంచాయతీ కార్మికులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మెదక్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం అదనపు అధికారి యూనూస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కోశాధికారి, పంచాయతీ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు నర్సమ్మ మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు నాలుగు నెలలు, మరికొంత మందికి 9,10 నెలల నుంచి వేతనాలు చెల్లించడం లేదన్నారు. గ్రామాల్లో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కార్మికులు పారిశుధ్య పనులు, వాటర్ సప్లయ్, ఎలక్ట్రిషన్ పనులు చేస్తున్నారు. ఈ పని మీదనే ఆధారపడి జీవిస్తున్నారు. వేరే ఆర్థిక అవకాశాలు ఏమీ లేవన్నారు. చేసిన కష్టం 9 నెలల నుంచి రాకపోతే కార్మికులు గ్రామాల్లో పారిశుధ్య పనులు ఎలా చేస్తారో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. ప్రతి నెలా గ్రీన్ చానల్ ద్వారా వేతనాలు చెల్లిస్తామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క మీడియా ఎదుట మాట్లాడారు. 2025 జనవరి 19న పంచాయతీ సిబ్బందికి వేతనాలు చెల్లించేందుకు ప్రభుత్వం రూ.149 కోట్లు విడుదల చేసింది. కానీ, పంచాయతీల నుంచి చెక్కులు పంపినా ఎస్టీవోలో నిలిచిపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రెండేండ్ల నుంచి యూనిఫామ్, ప్రతి నెలా సబ్బులు, నూనెలు ఇవ్వాల్సి ఉండగా, అవి కూడా ఇవ్వడంలేదన్నారు. గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఎన్నిసార్లు అడిగినా అధికారులు నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారన్నారు. ధర్నాలో పంచాయతీ యూనియన్ జిల్లా కార్యదర్శి ఆసిఫ్, నాయకులు స్వామి, రమేశ్, రవి, వసంత, పుష్ప తదితరులు పాల్గొన్నారు.


బాధిత రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తున్న నిమ్జ్ ప్రాజెక్టు ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రాజు

## మామిడ్గిలో ఉద్రిక్తంగా గ్రామసభ

### నిమ్జ్‌కు భూసేకరణపై రైతుల ఆగ్రహం

జహీరాబాద్, మార్చి 12: మూడు పంటలు పండే సారవంతమైన భూములను నిమ్జ్ ప్రాజెక్టుకు ఇవ్వమని రైతులు తేల్చి చెప్పారు. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని మామిడ్గి గ్రామ రైతు వేదికలో బుధవారం జహీరాబాద్ నిమ్జ్ ప్రాజెక్టు ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రాజు ఆధ్వర్యంలో భూసేకరణపై రైతులకు అవగాహన, అభ్యంతరాల స్వీకరణ కోసం భారీ బందోబస్తు మధ్య గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా నిమ్జ్ ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ.. నిమ్జ్ ప్రాజెక్టు కోసం గ్రామంలో 1169 ఎకరాల భూమిని సేకరిస్తున్నామని తెలిపారు. పట్టా, ప్రభుత్వ భూములకు రూ.15 లక్షల చొప్పున పరిహారం చెల్లిస్తామని చెప్పారు. రైతులు ముందుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడారు. మూడేండ్లుగా తమ గ్రామ భూముల రిజిస్ట్రేషన్లు నిలిపివేశారని, ఎలా రిజిస్ట్రేషన్ ప్రకారం మెరుగైన పరిహారాన్ని చెల్లిస్తారని అధికారులను ప్రశ్నించారు. జనరల్ అవార్డు కింద చెల్లించే పరిహారంతో ఇంటి ప్లాటు రావడం లేదన్నారు. పట్టా భూములను ఇతరులకు అమ్ముకునేందుకు వీలు లేకుండా నిలిపివేశారని, బ్యాంకులో రుణాలు ఇవ్వకుండా ఆదేశాలు జారీచేయడం దారుణమని పేర్కొన్నారు. మెరుగైన పరిహారం ఇవ్వకుండా, బ్యాంకుల నుంచి రుణాలు మంజూరు కాకుండా తమను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని అధికారుల తీరుపై గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొందరు రైతులు నిమ్జ్ ప్రాజెక్టుకు భూములు ఇస్తామని చెప్పడంతో మరికొందరు రైతులు అడ్డుకున్నారు. దీంతో రైతుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుని రైతు వేదికలో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో నిమ్జ్ ప్రాజెక్టు అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. నిమ్జ్ అధికారులు అర్ధంతరంగా వెళ్లిపోవడంతో రైతులు ఆందోళనలకు దిగారు. కొన్నేండ్లుగా నిమ్జ్, రెవెన్యూ అధికారులు తమను ముప్పుతిప్పలు పెడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సారవంతమైన భూములను నిమ్జ్ ప్రాజెక్టు సేకరణ నుంచి తొలిగించాలని, తమ భూములు మార్కెట్‌లో అమ్ముకునేందుకు అవకాశాలు కల్పించాలని, బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. గ్రామసభలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహ్మన్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామసభలో తహసీల్దార్ భూపాల్, డిప్యూటీ తహసీల్దార్లు రాజిరెడ్డి, సతీశ్, ఆర్ఐ సిద్ధరెడ్డి, జహీరాబాద్ పట్టణ, రూరల్ సీఐలు శివలింగం, జక్కుల హనుమంతు, ఎస్ఐలు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రూపు-2లో సుస్మితకు రెండో ర్యాంకు



పాపన్నపేట, మార్చి 12: మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని అబ్లాపూర్‌కు చెందిన సుస్మిత గ్రూపు–2 ఫలితాల్లో సత్తా చాటింది. రాష్ట్రస్థాయిలో 406 మార్కులు సాధించి అమ్మాయిల విభాగంలో రెండో స్థానాన్ని సంపాదించింది. ఆమె ప్రస్తుతం కొల్చారం గురుకుల పాఠశాలలో పని చేస్తున్నారు. గ్రూప్–1లో కూడా 401 మార్కులు సంపాదించిన సుస్మితను కుటుంబసభ్యులు, మండల వాసులు అభినందిస్తున్నారు.


చేర్యాల్‌లో ఇండ్ల నిర్మాణాలపై అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

## ఇంటి విస్తీర్ణం, యూనిట్ విలువ పెంచాలి

### సంగారెడ్డి కలెక్టర్‌కు చేర్యాల్ గ్రామస్తుల విన్నపం

కంది, మార్చి 12: నలభైఐదు గజాల్లో నిర్మించే ఇందిరమ్మ ఇల్లు సరిపోతుందా, ఆ ఇంట్లో ఉండేదెలా అని సంగారెడ్డి జిల్లా కంది మండలం చేర్యాల్ గ్రామస్తులు కలెక్టర్ వల్లూరు క్రాంతి దృష్టికి తెచ్చారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా పైలెట్ ప్రాజెక్ట్‌గా చేర్యాల్ గ్రామాన్ని ఎంపిక చేశారు. గ్రామంలో ఇంటి స్థలం ఉన్న 164 మందిని ఇందిరమ్మ ఇండ్లకు అర్హులుగా గుర్తించారు. ఇందులో మొదటి ప్రాధాన్యతగా 65 ఇండ్లు నిర్మించేందుకు అధికారులు చర్య లు తీసుకుంటున్నారు. బుధవారం కలెక్టర్ క్రాంతి చేర్యాల్ గ్రామంలో పర్యటించి నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణాలకు సంబంధించి అధికారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. నిర్మాణ పనులను వేగవంతం, నాణ్యతపై దృష్టిసారించాలని అధికారులను ఆమె ఆదేశించారు. 45 గజాల్లో ఇంటిని నిర్మించుకుంటే అందులో ఎలా ఉండాలని, స్థలం తమదే కాబట్టి కొంచెం స్థలాన్ని పెంచుకునే అవకాశం కల్పించాలని గ్రామస్తులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తరపున ఇచ్చే రూ.5లక్షలే ఇవ్వండని పెంచిన, స్థలానికి అయ్యే ఖర్చు తామే భరిస్తామని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే తాము నడుచుకోవాల్సి ఉంటుందని, ఇందులో తామేమి చేయలేమని కలెక్టర్ వారికి తెలిపారు. దీనిపై ప్రభుత్వానికి విన్నవిస్తామన తెలిపారు. అనంతరం కంది రైతువేదిక వద్ద నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ మల్లయ్య, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో మహేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుదీర్‌రెడ్డి, హౌసింగ్ పీడీ చలపతిరావు, ఏఈ మాధవరెడ్డి, నాయకులు జూలకంటి ఆంజనేయులు పాల్గొన్నారు.


గౌతాపూర్‌లో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

## నీటి ఎద్దడిపై రోడ్డెక్కిన మహిళలు

చిలిపిచెడ్, మార్చి 12: మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలంలోని గౌతాపూర్‌లో తాగునీటి సమస్యతో మహిళలు వ్యవసాయ బోరుబావులను ఆశ్రయిస్తున్నారు. తాగునీటి సమస్యపై గ్రామ మహిళలు బుధవారం ప్రధాన రోడ్డుపై ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. గ్రామంలో 15 రోజుల నుంచి నీరు రాకపోవడంతో వాటర్ ట్యాంకర్ ద్వారా నీరు అందించారు. మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీటి సమస్య గురించి అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.